క్లుప్తంగా

ఘన నివాళి



నెల్లూరు సిటీ: బీవీనగర్‌లో మాజీ కార్పొరేటర్ మేకల నరేంద్రరెడ్డి తల్లి సులోచనమ్మ మరణించారు. ఈ క్రమంలో ఆమె పార్థివదేహానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి బుధవారం నివాళులర్పించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, బీసీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్యామ్‌సింగ్, నేతలు మల్లికార్జున్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు తదితరులు పాల్గొన్నారు.

⇨ కావలికి చెందిన దామిశెట్టి శ్రీనివాస్‌నాయుడి పెద్దకర్మకు ఆనం విజయకుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

వేడుకగా లక్ష మల్లెల పూజ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): అక్షయ తృతీయను పురస్కరించుకొని వెంకటేశ్వరపురంలో కొలువైన వెంకటేశ్వరస్వామి ఆలయంలో లక్షమల్లెల పూజను బుధవారం నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరయ్యారు. ఉభయకర్తలుగా శేషగిరిరావు, హరిత దంపతులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ నాగిరెడ్డి, ప్రధానార్చకుడు సాయిభరద్వాజ తదితరులు పర్యవేక్షించారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



నెల్లూరు సిటీ: ముత్తుకూరు సెంటర్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేశారు. పుచ్చకాయలు, వాటర్ బాటిళ్లు, మజ్జిగ తదితరాలను పంపిణీ చేశారు. నిషాద్, అమన్, గురుకృష్ణ, దానా మహేష్, మోహన్, కిరీటి, మోషే, సుకుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులకు శంకుస్థాపన



నెల్లూరు సిటీ: ముత్తుకూరు గేట్ వద్ద ఫ్లైఓవర్ సుందరీకరణ పనులకు శంకుస్థాపనను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బుధవారం చేపట్టారు. కమిషనర్ నందన్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్ జ్యోతిప్రియ, మదన్‌కుమార్‌రెడ్డి, దార్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్‌కు జాగా కరువు

- రోడ్లపైనే నిలిపేస్తున్న వైనం
- యథేచ్ఛగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ
- పాదచారులకు తప్పని పాట్లు
- తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్య
- పట్టించుకోని అధికారులు



బారకాసు సెంటర్‌లో రోడ్డు మధ్యలో వాహనాల పార్కింగ్

నెల్లూరు(బారకాసు): నగరంలో వ్యాపార సముదాయాలకు పార్కింగ్ వసతి కరువైంది. కొన్ని ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలను సాగిస్తుండటంతో ప్రజలు తమ వాహనాలను రోడ్డుపైనే నిలిపి వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా దారి లేక పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికార యంత్రాంగం ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో సమస్య తీవ్ర రూపం దాలుస్తోంది.

ఇదీ పరిస్థితి..

⇨ నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. ఫలితంగా వాణిజ్య సముదాయాలు, ఆలయ ప్రాంగణాల వద్ద ట్రాఫిక్ సమస్యలు నిత్యకృత్యమవుతున్నాయి. వీఆర్సీ కళాశాల ప్రధాన గేట్ నుంచి ముత్తుకూరు అండర్ బ్రిడ్జి వైపు వెళ్లే రహదారిలో కళాశాల ప్రహరీని ఆనుకొని రోడ్డు వెంబడి షెడ్లను ఏర్పాటు చేసి పండ్ల వ్యాపారాలు సాగిస్తున్నారు. షెడ్లను అంతకంతకూ పెంచుకుంటూపోతూ రోడ్డు ఆక్రమణకు పాల్పడుతున్నారు. దీనికి తోడు అక్కడికి వచ్చే వారు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతుండటంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది.

⇨ ట్రంక్ రోడ్డులోని షాపుల యజమానులు తమ దుకాణాల పేర్లు కనిపించాలనే ఉద్దేశంతో బోర్డులను ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేస్తున్నారు. మరికొందరు తమ దుకాణాల ముందు టేబుళ్లను ఏర్పాటు చేసి వ్యాపార నిమిత్తం అద్దెకు ఇస్తున్నారు. తోపుడు బండ్లను రోడ్లపైనే పెట్టుకొని వ్యాపారాలు సాగిస్తుండటం సైతం సమస్యకు కారణమవుతోంది.

⇨ చిల్డ్రన్స్ పార్కు రోడ్డులో ఫుట్‌పాత్‌లపై పలు దుకాణాలను ఏర్పాటు చేశారు. దీంతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపైనే నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక్కడ ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని నగరపాలక సంస్థ అధికారులు పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినా, నిర్వాహకులు పెడచెవిన పెడుతున్నారు.

⇨ రామలింగాపురం, లీలామహల్ సెంటర్, పాత జెడ్పీ కార్యాలయ రోడ్లలో పార్కింగ్‌కు ప్రత్యేక వసతి లేదు. దీంతో ద్విచక్రవాహనాలతో పాటు కార్లను రోడ్డు మధ్యలోనే నిలుపుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలు సాగించాలంటేనే గగనమవుతోంది.

⇨ చిన్నబజార్, పెద్దబజార్ ప్రాంతాల్లోని ప్రధాన రోడ్డు అంతంతమాత్రమే. దీనికి తోడు అక్కడ దుకాణాల ముందు తోపుడు బండ్ల ఏర్పాటుతో రోడ్లు ఇరుకుగా మారి ట్రాఫిక్‌కు ఇబ్బంది తలెత్తుతోంది.

లోపించిన సమన్వయం

నగరపాలక సంస్థ అధికారులు, ట్రాఫిక్ పోలీసుల మధ్య సమన్వయం లోపించడంతోనే ఈ పరిస్థితి ఏర్పడుతోందనే ఆరోపణలు లేకపోలేదు. స్పెషల్ డ్రైవ్ పేరుతో ఆక్రమణల తొలగింపునకు అడపాదడపా పూనుకునే అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



లీలామహల్ థియేటర్ సమీపంలో ఇలా..

చర్యలు చేపట్టాలి



ప్రధాన రోడ్లలో వ్యాపార సముదాయాలకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వాహనాలను ఎక్కడపడితే అక్కడే నిలిపేస్తున్నారు. ఇలా వాహనాలు నిలిపిన వారికి పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. పార్కింగ్ సదుపాయం లేని వ్యాపార సంస్థలపై ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. ఇలాంటి వాటిపై అధికారులు కఠిన చర్యలు చేపట్టాలి.

– రమణారెడ్డి

రీచ్‌లలో సీసీ కెమెరాల ఏర్పాటు



రీచ్‌ను పరిశీలిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ఇసుక రీచ్‌లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. నగరంలోని బోడిగాడితోట, సుభాష్‌నగర్, దీన్‌దయాళ్‌నగర్, పొర్లుకట్ట, దొరతోపు, వెంకటేశ్వరపురం, టిడ్కో గృహ సముదాయాల ప్రాంగణం తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో రీచ్‌ల నుంచి ఇసుక రవాణా అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. హరనాథపురంలోని కాలువపై ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరారు. బీవీఎస్ బాలికల పాఠశాలలో షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం, వాలీబాల్ కోర్టు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం తడికలబజార్ కూడలిలోని అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఈఈ రహంతుజానీ, డీఈఈలు రఘురామ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరి

నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని వ్యాపారాలకు ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరని, వీటిని పొందేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్ విభాగాధికారులు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని డివిజన్లలో ఫాగింగ్ ప్రక్రియను రెండు వారాలకోసారి అమలు చేయాలని చెప్పారు. ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఎంహెచ్‌ఓ చైతన్య, మలేరియా విభాగాధికారి జిజియాబాయి, వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్, సిటీ ప్లానర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని వీపీఆర్ కన్వెన్షన్లో టంగుటూరు శ్రీనివాసులురెడ్డి కుమార్తె శరణ్య.. కొడవలూరు వెంకటకృష్ణారెడ్డి కుమారుడు భాస్వంత్‌రెడ్డి వివాహం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వధూవరులను మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆశీర్వదించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నేతలు స్వర్ణ వెంకయ్య, పాశం శ్రీనివాస్, హరిబాబుయాదవ్, మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, బెల్లంకొండ వెంకయ్య, నానీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా



సూచనలు చేస్తున్న చైతన్య

నెల్లూరు(బారకాసు): నగరంలోని ప్రధాన రహదారుల పక్కన చెత్తను వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించాలని ఎంహెచ్‌ఓ చైతన్య పేర్కొన్నారు. నగరంలోని 47వ డివిజన్లో పారిశుధ్య పనులను కార్పొరేటర్ పాట్లూరి రామకృష్ణతో కలిసి బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. 44, 46వ డివిజన్లో నైట్ శానిటేషన్ జరుగుతోందని, ఇక నుంచి ఈ డివిజన్లోనూ జరపాలని సూచించారు.

సీహెచ్‌ఓలకు అండగా పోరాటం



నెల్లూరు(అర్బన్): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేస్తున్న పోరాటానికి ఏపీ హంస అసోసియేషన్ అండగా ఉంటుందని జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, కోశాధికారి మజహర్ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా వైద్య శాఖ కార్యాలయం వద్ద సీహెచ్‌ఓలు చేపట్టిన ఆందోళన బుధవారంతో రెండో రోజుకు చేరింది. వీరికి మద్దతు తెలిపిన అనంతరం సుధాకర్‌రావు మాట్లాడారు. వీరికి ఫిక్స్‌డ్ జీతాలివ్వకపోవడం, ఆయుష్మాన్ భారత్ మందిరాల అద్దె చెల్లించకపోవడం దారుణమన్నారు. వీరి డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. నేతలు నాగరాజు, ఉమా, రవి, సీహెచ్‌ఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భానుమహేష్, కార్యదర్శి రెబకా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద వీఆర్‌ఏల ధర్నా



నెల్లూరు(అర్బన్): తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ధర్నాను జిల్లాలోని వీఆర్‌ఏలు బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు పెంచలనరసయ్య మాట్లాడారు. వీఆర్‌ఏలకు పే స్కేల్ జీతాలను చెల్లించాలని కోరారు. ఖాళీగా ఉన్న వీఆర్‌ఏ, వీఆర్వో, అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ విజయకుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దుర్గయ్య, భాస్కర్, లచ్చయ్య, ఓబులేసు, శ్రీను, అమీర్, అంకయ్య, జమున, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

తరగతుల నిర్వహణపై చర్యలకు వినతి



ఏడీకి వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): వేసవి సెలవుల్లో తరగతులను నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి షారూఖ్ కోరారు. ఈ మేరకు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీ గ్లోరీ కుమారికి వినతిపత్రాన్ని బుధవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. అడ్మిషన్లను అక్రమంగా నిర్వహిస్తూ, యూనిఫారం, పుస్తకాలకు అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మస్తాన్, హర్ష, పూజిత్, లోకేష్, చరణ్, నవీన్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల మృతిపై దిగ్భ్రాంతి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కోవూరు మండలంలోని పోతిరెడ్డిపాళెం వద్ద జరిగిన కారు ప్రమాదంలో వైద్య విద్యార్థులు మృతి చెందడంపై మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబీకులకు తన ప్రగాఢ సానుభూతిని ఆయన తెలియజేశారు.

⇨ పోతిరెడ్డిపాళెం వద్ద జరిగిన కారు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం బాధాకరమన్నారు.

పోలీసుల నోటీసులు దారుణం

నెల్లూరు రూరల్: గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి పర్యటనలు జరుపుకోవాలన్నందుకు గానూ నోటీసులను పోలీసులివ్వడం దారుణమని ఆర్పీఐ జిల్లా అధ్యక్షుడు మాబూ పేర్కొన్నారు. గాంధీబొమ్మ సమీపంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రజల గొంతును నొక్కేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అధికారాన్ని అనుభవిస్తున్న కూటమి ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని స్పష్టం చేశారు. సమావేశంలో పట్టపు రంగారావు, సంబూరు గణేష్, సుబ్బారావు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం కొనుగోళ్లు.. అంతంతమాత్రం

- 50 శాతానికి పైగా పతనం
- ధరల పెరుగుదలే కారణం
- అక్షయ తృతీయ రోజున వెలవెలబోయిన దుకాణాలు



నెల్లూరులోని ఓ షాపులో ఇలా..

నెల్లూరు(బృందావనం): రోజురోజుకూ పెరుగుతున్న పసిడి ధరలతో అక్షయ తృతీయ వెలవెలబోయింది. పేద, మధ్య తరగతి వారితో పాటు ఆర్థికంగా స్థితిమంతులుగా ఉన్న వారు తమకు తోచిన రీతిలో బంగారాన్ని కొనుగోలు చేయడం ఏటా పరిపాటి. అయితే ఈ దఫా పది గ్రాముల మేలిమి బంగారం ధర రూ.లక్షకు చేరువ కావడంతో చాలామంది ఆసక్తి చూపలేదు. దీంతో గతేడాదితో పోలిస్తే ఈసారి 50 శాతం మేర విక్రయాలు తగ్గిపోయాయి. గతేడాది అక్షయ తృతీయ నాటికి 24 క్యారెట్లు (10 గ్రాములు) ధర రూ.75,380 ఉండగా, ఈసారి రూ.98,750కు చేరింది. 22 క్యారెట్ల ఆర్నమెంట్ (ఒక గ్రాము) ధర నాడు రూ.6,751 ఉండగా ఇప్పుడు రూ.8,980కు పెరిగింది. సవర (8 గ్రాములు) అప్పుడు రూ.55,632 ఉండగా, ఈసారి రూ.74 వేలుగా ఉంది. దీంతో బంగారం కొనుగోలు చేయాలంటే జనం బెంబేలెత్తిపోతున్నారు.

చాలా తక్కువగా కొనుగోలు



భారీగా పెరిగిన బంగారం ధరతో ఈ ఏడాది అమ్మకాల్లేవు. చాలా వరకు గ్రాము, రెండు, మూడు గ్రాములకే పరిమితమయ్యారు. 50 శాతం మేర అమ్మకాలు పడిపోయాయి. గతంలో అక్షయ తృతీయ రోజున షాపులు కళకళలాడేవి. ఈ ఏడాది ఆ పరిస్థితే లేదు.

– కొనగళ్ల శోభన్‌బాబు, నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్, పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

సందడే లేదు



బంగారం ధర విపరీతంగా పెరగడం అక్షయ తృతీయకు శరాఘాతంగా మారింది. అక్షయ తృతీయ రోజున ఒకప్పుడు చిన్నబజార్ ప్రాంతంలో ఉన్న వందలాది బంగారు దుకాణాలు సందడిగా ఉండేవి. ఇప్పుడు అదేమీ లేదు.

– బయ్యా ప్రసాద్, బంగారు దుకాణ యజమాని, చిన్నబజార్

విద్యార్థులకు అభినందన



నెల్లూరు (పొగతోట): జెడ్పీ పాఠశాలల్లో చదువుతూ పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ బుధవారం అభినందించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన పూజిత, కృషినగర్ (595), జువేరియా, నవలాకుల గార్డెన్స్ (594), జ్ఞాపిక, వింజమూరు.. భార్గవ్, నర్సాపురం (593)ను అభినందించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు గిరిధర్‌సింగ్, శ్రీనివాసులు, మాలకొండయ్య, నాగేశ్వరరావును సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాంక్షించారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఈఓ విద్యారమ, డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



రోదిస్తున్న విద్యార్థినులు



కడచూపునకు వచ్చిన తోటి విద్యార్థులు



శోకసంద్రం

కోవూరు సమీపంలోని పోతిరెడ్డిపాళెం వద్ద కారు అదుపుతప్పడంతో ఐదుగురు వైద్య విద్యార్థులు, దుకాణ నిర్వాహకుడు మృతి చెందారు. పెద్దాస్పత్రి మార్చురీ వద్దకు చేరుకున్న సహచర విద్యార్థులు, రమణయ్య కుటుంబీకులు గుండెలవిసేలా రోదించారు. వీరి ఆవేదన పలువుర్ని కంటతడికి గురిచేసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



వివరాలు ఆరాతీస్తున్న పోలీసులు



విలపిస్తున్న రమణయ్య కుటుంబీకులు